


ఆశగా, ఆత్రతగా మెట్లెక్కి హాలులో మామూల కుర్చీలో కూర్చుని చిరిగిన చొక్కా అంచుతో ముఖం తుడుచుకుని ఉస్సురని నిట్టూర్చాడు నారాయణ.

పైన — గిర్రున తిరుగుతోంది ఫ్యాను. చెమటలు కారుతున్న వొంటికి ఫ్యానుతాలూకు వేడిగాలి చల్లగా తగులుతూంది. ఆ సుఖానికి సొలసి పోతూ కుర్చీలో వెనక్కి వాలాడు నారాయణ కళ్ళుమూసుకుని.

విసుక్కుంటూ వచ్చాడు సర్వర్.

చెవిలో పెన్సిల్‌ని వేళ్ళతో తీసి — టేబుల్ మీద టక్ టక్ కొట్టి "ఏం కావాలి ?" అన్నాడు మహానిర్లక్ష్యంగా. చూడబోతే — నారాయణ లాటి నాసిరకం సమానవులకి సప్లయ్ చేయవలసి వచ్చిన కర్మానికి తనమీద తనే కోపగించుకుంటున్నట్లున్నాడు సర్వారాయుడు.

బిక్కు బిక్కు మంటూ — మహా వినయంగా — "సింగిల్ టీ — డబల్

స్ప్రింగ్." అని వేదుకున్నాడు నారాయణ. భ్రుకుటి చిట్లించి మరీ అడిగాడు సప్పర్. "చిల్లరుందా ?"

తెల్లబోయి – దొరికి పోయిన దొంగలా–నీరసంగా అన్నాడు నారాయణ, "లేదు. రూపాయి నోటుంది."

"మంచి బేరమే ! ఆ బోర్డుచదువ్.. చదవటం వచ్చునా ?"

"ఉహుఁ"తలపంకించాడునారాయణ.

"సరే. చదువుతాను, విను. ఏభై పైసల లోపు బిల్లు చేయువారు చిల్లర తెచ్చుకోవలెను. అర్థమైందా ?"

నారాయణకి ముఖం తిరిగినంత పనయింది.

ఉస్సురని నిట్టూర్చి కుర్చీలోంచి లేచాడు.

ఎవరో తరుముతున్నట్లు మెట్లు దిగి రోడ్డుమీద పడ్డాడు.

ఎండ పేల్చేస్తూంది.

వడగాడ్పు కొడుతూంది.

క్షణంలో వొళ్ళంతా చెమటలు పట్టేసింది.

నాలుక ఎండిపోయి పిడచ కట్టుకుపోయింది.

ఒక్కసారి జేబులో రూపాయినోటు తీసి చూసుకున్నాడు. దాన్ని చూసేసరికి కొత్త శక్తి వచ్చింది మనిషిలో. డబ్బుకి చాలా శక్తి వుంది మరి.

"ఐస్ క్రీమ్ –"

బండి తోసుకుంటూ అరుస్తున్నాడు ఐస్‌క్రీమ్‌వాలా.

"ఒకటియ్యి." రూపాయి నోటు చూపాడు నారాయణ.

"చిల్లర లేదు -" నిర్లక్ష్యంగా వెళ్ళిపోయాడు ఐస్‌క్రీమ్‌వాలా.

నారాయణకి యావత్ప్రపంచమూ అంధకార బంధురంగా తోచింది. తేరుకుని అడుగు ముందుకు వేశాడు.

చెట్టునీడ చల్లగా పిలిచింది.

ఆ ప్రక్కనే మునిసిపాలిటీ కొళాయి ఆత్రంగా మరతిప్పాడు. బుస్‌మంటూ శబ్దం, నీళ్ళురాలేదు. కొళాయి పకపక నవ్వినట్లే అంది. చెట్టునీడను చేరుకున్నాడు. హాయిగా అనిపించింది.

మళ్ళీ రూపాయినోటు పైకి తీశాడు. దానిమీద పట్టరాని కోపం వచ్చింది. వెనువెంటనే అతని కోపం సెట్టిగారిమీదకు మళ్ళింది.

* * *

భారతదేశంలో పుష్కలంగా ఉండేది జనాభా.

ఆ జనాభాలో అధిక సంఖ్యాకులు ముష్టివాళ్ళు. అటువంటి ముష్టివాళ్ళలో నారాయణకూడా ఒకడు. నారాయణ తాత ముష్టివాడు, తండ్రిముష్టివాడు. నారాయణ ముష్టివాడే. వంశ పారంపర్యంగా వస్తున్న వృత్తి అది. నారాయణకి ముష్టెత్తుకోడంతప్ప మరేమీ చేతకాదు. అందుకు విచారించనూలేదు. కాఫీ హోటల్‌ముందు కూర్చుని ముష్టెత్తుకోడం–అతనికి గర్వంగానే ఉండేది. వీధులు తిరిగి ముష్టెత్తుకునే వాళ్ళతో తనను పోల్చుకుని సంతోషించేవాడు కూడా !

ఆవేళ .... హోటల్‌ముందు నారాయణ ఒక్కడే కూర్చున్నాడు. కొంచం ముసురుగా ఉంది. టిఫిన్‌తిని త్రేన్చుకుంటూ మెట్లుదిగి–ఐదువేళ్ళకీ అరుంగ

రాలున్నాయి. అవి తళతళ్ళాడుతు న్నాయి. షాహుకారు ముందుకు వంగి నారాయణ బొచ్చెలోకి చూశాడు.

ఒకట్లు .... రెండ్లు .... ఐదులు .... పదులు .... పైసలు.

"రూపాయినోటు తీసుకుని తొంభై పైసలు తిరిగివ్వు" నారాయణ కళ్ళు మెరిశాయి ఒక్కసారి పదిపైసలు ఎంత మారాజు.

ఆకళ్ళల్లోని మెరుపుని కనిపెట్టినట్లు నవ్వి - "నాతోరా నీకో మంచి మాట చెబుతాను" అన్నాడు.

నారాయణ ఆశ్చర్య పడుతూ భయ పడుతూ అతని వెంట నడిచాడు. అంత గొప్ప షాహుకారికి తనలాటి ముష్టోడితో పనేమిటో ?

"రోజూ నీకెన్ని పైసలు దొరుకు తాయి ?"

"చెప్పవేం మారాజా ! ఒక్కోనాడు రూపాయి పై చిలుకి దొరుకుద్ది ఒక్కో నాడు పదిహేను పైసలో యిరవై పైసలో.

"ఇలా అడుక్కోడం నీకు కష్టంగా లేదూ?"

"మరో దారిలేదుకదా మారాజా ...."

"వ్యాపారం చేస్తావా ?"

ఎకసక్కెం ఆడుతున్నాడేమో అని పించింది నారాయణకి. ముఖం చిన్న బుచ్చుకున్నాడు.

"నేను నిజంగానే అడుగుతున్నాను"

"పైసాకి టికానా లేనోణ్ణి నేనేటి యాపారం సెయ్యగలను ?"

"నీకు చేతనైనదే చేద్దువుగాని నేను చెప్పినట్లు వింటావా ?"

"వింటానుదొరా" చేతులు కట్టుకుని నిలుచున్నాడు.

షాహుకారు ఉపదేశం చేశాడు.

నారాయణ ఆనందంగా ఉపదేశం పొందాడు.

* *

నారాయణ అడుక్కోవడం మానే శాడు.

ముష్టోళ్ళకి లీడరై పోయాడు. వాళ్ళ దణ్ణా లందుకుంటున్నాడు. రోజూ చీకటి పడ్డాక షాహుకారిని వారి పెరట్లో రహ స్యంగా కలుసుకుంటున్నాడు. వాళ్ళిద్దరి మధ్యా మాటలాట్లే వుండవు. గల్లు గల్లు మని చిల్లర మోత. రెపరెపలాడే నోట్ల గర గర. అంతే. చిల్లర షాహుకారి చేతులలోకి, దానికి తగినన్నినోట్లు నారా యణ చేతులలోకీ మార్పిడి జరుగుతుంది.

నారాయణ దగ్గర కంత చిల్లరెలా పోగవుతూంది? ముష్టోళ్ళ దగ్గరకెళ్ళడం, తొంభై ఐదు పైసలు తీసుకుని రూపాయి నోటు చేతిలో పెట్టడం. నర మాంసం రుచి మరిగిన పులులే అయ్యారు వాళ్ళూ నారాయణా. ఐదు పైసలు అప్పనంగా వస్తున్నాయన్న ఆనందంలో వాళ్ళే వచ్చి నారాయణ చేతుల్లో చిల్లర పోస్తున్నారు. ఎనభై ఐదు పైసలకీ రూపాయి నోటు చొప్పున నారాయణ షాహుకారు నుంచి తీసుకుంటున్నాడు. బరువయిన నాణాలకు విలువెక్కువ యిస్తాడు షాహుకారు.

నెలలు గడిచాయి.

ప్రజల చేతులలోంచి ముష్టివాళ్ళచేతు ల్లోకి జారిన చిల్లర - వాళ్ళ నుండి నారాయణ ద్వారా షాహుకారి కందు తూంది.

కూర్చుని తింటూంటే కుప్పలే తరిగి

పోతాయి.

చేయి జారడమే కాని తిరిగి చేరడం లేదు చిల్లర.

దేశంలో ఒక్క నారాయణే కాదు. అనేక నారాయణులు—ఊరూరా వాడ వాడా. వాళ్ళననుసరించి సేట్ జీలూ, షావుకార్లూ, కొండెక్కె చందంగా తయారౌతూంది ముష్టివాళ్ళ పరిస్థితి. మునుపటిలా పైసలు రాలడం లేదు. ధర్మాత్ములూ దయా మయులూకూడా చిల్లర లేదంటూ మొండి చెయ్యి చూపుతున్నారు.

ధరలు క్షణ క్షణానికీ పైకి లేచి పోతూనే ఉన్నాయి.

వస్తువుల విలువ పెరిగి పోతూనే ఉంది. అడ్డూ ఆపూ లేకుండా. వ్యాపారంలో రెండు మూడుసార్లు మిలట్రీ హోటల్లో చేపల భోజనం, సారా దుకాణంలో గ్లాసుడు సారా. క్రమ క్రమంగా ఆ భోగం అంతరించి పోయింది.

చికాకులతో చిల్లర అందించే నారాయణ— రెండు చేతులూ పట్టేపాటి చిల్లర సంపాదించ డానికికూడా నానా యాతనలూ పడవలసి వస్తుంది. అడ్డమైన గడ్డి కరచినా ఐదు రూపాయల చిల్లర దొరకడం గగనమౌతూంది.

అంతకీ ముష్టి పెద్ద (ముష్టివాళ్ళ లోనూ పెద లుంటారు. వారి మాటకి ముష్టివాళ్ళలో అంతో యింతో విలువ ఉంటుంది.)

"ఈ మునలం దేనికి దారితీస్తుందో? షాహుకార్లతో చేతులు కలిపావో — నువ్వు చెడిపోతావ్, వాళ్ళు బాగుపడ తారు. నా మాటవిను. మామూలు మను షులని నమ్ము. గొప్పవాళ్ళని నమ్మకు. చెడిపోతావ్ —" అంటూ ఓ సారి నారాయణని హెచ్చరించక పోలేదు.

ప్రభుత్వ సారాయి దుకాణంలోని సారాగ్లాసూ, మిలట్రీ హోటల్లో చేపల పులుసు భోజనం. వీటిముందు ముష్టి పెద్ద మాటలు వినపడలేదు నారాయణకి. అదికాక — యీ వ్యాపారం మానేస్తే మళ్ళీ ముష్టి ఎత్తాలి. అది — పూలమ్మిన చోట కట్టెలమ్మడమంత అవమానంగా అనిపించింది. అందుచేత వెనక్కి వెళ్ళ దలచుకోలేదు నారాయణ.

* * *

షాహుకారు రెండంతస్తుల మేడ లేపాడు.

నారాయణ కాలువవొడ్డు గుడిసె లోంచి ఊరవతల చెట్టుకిందకు మారాడు.

పెళ్ళామూ నలుగురు బిడ్డలూ ఎండ కెండి వానకి తడుస్తున్నారు. ఆకలికి కుష్కించి పోతున్నారు. అన్నం దొరక్క అల్లల్లాడి పోతున్నారు. వారి ఆరనాదాలు ఎవరి గుండెలనీ కరిగించ లేక పోతున్నాయి. ఏ అమ్మా పట్టె డన్నం పెట్టటం లేదు. ఏ అయ్యా చేతిలో పైసా రాల్చడం లేదు.

ముష్టివాళ్ళందరూ నారాయణని వెలి వేశారు.

నారాయణ తమకేదో ద్రోహంచేశాడనే తప్ప అదేమిటో స్పష్టంగా వారికీ తెలి యదు. ఒకటి మాత్రం వాళ్ళు నిశ్చ యించుకున్నారు. తమ జోలెల్లో పైసలు రాలకపోడానికి కారణం నారాయణే.

ముష్టివాళ్ళు వెలివేశారంటే — ఏమీ చెయ్యరు. వెలివేయబడ్డ కుటుంబానికి

మిగిలినవాళ్ళు ఎవ్విధమయిన సహాయ సహకారాలూ అందించరు. గొంతులెండి చచ్చిపోతున్నా నీటిబొట్టు రాల్చరు. అందుకే వాళ్ళు నారాయణనీ, అతని కుటుంబాన్నీ కాలవగట్టునుంచి తరిమేశారు పగబట్టినట్లు.

చెట్టుకింద నారాయణకుటుంబం ఎన్ని కష్టాలుపడాలో అన్ని కష్టాలుపడుతోంది; చివరకు భార్య నారాయణని దుమ్మెత్తి పోసింది. "ముష్టెత్తుకుంటూ హాయిగా ఉండక యీపాపం అంటూ పాముపడగలాటి సాహుకారు నాశ్రయించావు. మన వాళ్ళకి విషమైపోయావు. ఆ సాహుకారు నీకేం ఒరగబెట్టాడు ? అటుసూడు. నీ బిడ్డలని నువ్వే సంపుకుంటున్నావ్. ఇయ్యేళకూడా వాళ్ళనోట్లో గంజినీళ్ళొయ్యకపోతే అళ్ళ ప్రాణాలు హరీమంటాయి. ఇక్కడ కూకొనేటి సేద్దెంవని? ఎల్లు.... నీ సావుకారినే అడుగు.

అసలే ఆడది.

ఆపైన ఆకలితోవుంది.

పైగా ఎండాకాలం.

ఇక ఆ నోటి ధాటికాగడం ఏ మగవాడి తరం ?

భయం భయంగానే నారాయణ లేచి వెళ్ళాడు.

నీరసంతో తూలుతూ షాహుకారింట అడుగు పెట్టాడు.

చిల్లర పట్టుకుని ఆ లోగిట్లోకి వెళ్ళేటప్పుడు ఏమిటో ధీమాగా ఉండేది. ఇప్పుడు గుండె బితుకుబితుకుమంటూంది

లోగిట్లో అడుగు పెట్టగానే అడిగాడు షాహుకారు "ఎంత ?" తలవంచుకుని అడ్డంగా వూపాడు నారాయణ.

"మరెందుకొచ్చావ్ ?" గద్దించాడు షాహుకారు.

"పెళ్ళాం బిడ్డలు ఆకలికి సచ్చిపోతున్నారు." రుద్ధకంఠంతో అన్నాడు నారాయణ.

ఓసారి వాడివంక కోపంగా చూసి" చేతకాని చవటవి.

చిల్లర తేలేనివాడి వెందుకు పనికొస్తావ్ ? ఇంకెప్పుడూ వొట్టి చేతులతో యీ యింటికి రాకు తెలిసిందా ?" అంటూ ఓ రూపాయి నోటు వాడి ముఖం మీదకు విసిరేశాడు షాహుకారు.

ఆ నోటందుకుని దణ్ణం పెట్టిబయట పడ్డాడు.

రూపాయినోటుతో ఏం చెయ్యాలో అప్పటికే నిర్ణయం ఐపోయింది.

ఓ పావలా నూకలు.

ఓ పావలా ఎండుచేపలు.

ఓ పావలా ఉప్పు ఎండు మిరపకాయలూ.

మరోపావలా—తనది.

కాని—యీ రూపాయినోటుని నాలుగు పావలాలు చెయ్యడం ఎలాగో ?

పావలా నూకలిమ్మంటే చిల్లర తెచ్చుకోమన్నాడు.

ఉప్పూ, వర్రకాయలూ యిమ్మంటే చిల్లల్లేదు పొమ్మన్నాడు. ఎండుచేపల దగ్గర మొండి చెయ్యే ఎదురయింది. హోటళ్ళలోనూ దొరకలేదు.

ఈ రూపాయినోటు మారదా ?

నిక్షేపంలా ఉంది నోటు, కొత్త నోటు కాకపోయినామరీ మాసిపోలేదు.

నారాయణ కళ్ళముందు పస్తులతో పడున్న పిల్లలు మెదిలారు. దుఃఖ

మొచ్చింది.

యీ రూపాయికి ఎందుకు చిల్లర దొరకడం లేదు.

షాహుకారూ, నీకు సంచీలకొద్దీ చిల్లరిచ్చాను. ఈ చేతులతో ఎన్ని దోసెళ్ళ చిల్లర నీ చేతుల్లో పోశానో! నాముఖం మీద రూపాయినోటిసిరేసి దుఃఖపెడుతున్నావ్. నీకు న్యాయమా? నువ్వేటి మంతరమేశావో యిది నాలుగు పావలాల వటంలేదు.

చెట్టునీడనుంచి పళ్ళీ రోడ్డెక్కాడు.

సూరీడు చుర్రుమనిపిస్తున్నాడు.

ఎండ తాచుపాములా కాటేస్తూంది.

శోషవస్తూంది.

నీరసం.... నిస్త్రాణ.... అడుగుపడడం అతికష్టమౌతూంది. పడగాడ్పుకి పెళ్ళు మండుతూంది.

లేని ఓపిక తెచ్చుకుని-విసుగుచెందని విక్రమార్కుడిలా చిల్లర కోసం తిరుగుతూనే ఉన్నాడు నారాయణ.

దగ్గర రూపాయినోటుండీ - గొంతు ఆరుకుపోతున్నా సోడా నీళ్ళు తాగలేని తన దుస్థితికి- నారాయణకి ఏడుపొస్తుంది.

ఎక్కే గడపా, దిగే గడపా.

చిల్లర దొరకడం లేదు.

ఎక్కడయినా ఒకే మాట. "చిల్లర తెచ్చుకో, ఫో...."

"ఇప్పుడు నేనెక్కడినుంచి చిల్లరట్టుకొచ్చేది? చేతనయినన్నాళ్ళు దోసెళ్ళ కొద్దీ షాహుకారు చేతుల్లో పోశాను. ఇప్పుడు నాకే నాలుగు పావులాలు దొరకడం లేదు." గొణుక్కుంటున్నాడు.

ఆగమ్మ కాకిలా ఊరంతా తిరుగుతూనే వున్నాడు రూపాయినోటు మారుద్దామని.

లాభం లేకపోయింది.

వడదెబ్బ తగిలింది.

కళ్ళు తిరిగిపోతున్నాయి.

రూపాయి నోటు మాత్రం నాలుగు పావలాలు కాలేదు.

చివరికి —

మండుటెండలో —

తూలిపోతున్న అడుగులతో ....

తనవాళ్ళుండే తావుకొచ్చాడు.

అల్లంత దూరానా ఆలి కనిపించింది. ఆ పక్కన పిల్లలు, వాళ్ళు కనిపించే సరికి రూపాయినోటుమీద కసి పెరిగిపోయింది. ఆవేశం వచ్చింది. అంతే.

ఉన్న పాళాన కుప్పగా కూలిపోయాడు నారాయణ.

లబో దిబో మంటూ లగెత్తుకొచ్చింది. ఆడది. ఇంకెక్కడి నారాయణ?

ప్రాణంలేదు. కట్టెబిగిలించి. మూసుకున్న పిడికలిలో రూపాయినోటు నాలుగు ముక్కలై ఉంది. నాలుగు పావలాలు కాలేని రూపాయినోటు నాలుగు ముక్కలైంది.

నారాయణ బతుకు ముక్కలవడానికి,

షాహుకారు మేడలమీద మేడలు కట్టడానికి;

మూలకారణం చిల్లరే.

వ్యాపారం ఎప్పుడూ వంద మందిని తొక్కేసి ఒక్కణ్ణి పైకెత్తుతుంది. అది - దాని లక్షణం. అంతే.